క్లుప్తంగా

అహ్మదీయ ముస్లిం సంస్థతో శాంతిభావం



చిన్నచింతకుంట: అహ్మదీయ ముస్లిం జమత్ సంస్థ శాంతిభావాని పెంపొందించే దిశగా పని చేస్తుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అహ్మదీయ ముస్లిం జమత్ మసీద్‌లో నిర్వహించిన అహ్మదీయ ముస్లిం సంఘం వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అలాగే దేవరకద్ర కాంగ్రెస్ నాయకుడు కొండా గోవర్ధన్‌రెడ్డి తల్లి కొండా సత్యమ్మ దశదిన కర్మకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కా ర్యక్రమంలో సంస్థ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అతౌల్ బసీర్ పాటు పలువురు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభం

జడ్చర్ల టౌన్: మండలంలోని మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయంలో ఆదివారం ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

❖ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని శేషాద్రినగర్ వినాయక మండపంలో ఆదివారం రాత్రి 'సామూహిక హనుమాన్ చాలీసా'ను మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు.

నిలిచిన బస్సును ఢీకొన్న బైక్: వ్యక్తికి గాయాలు

మిడ్జిల్: మండలంలోని వేంకటేశ్వర ఆలయం సమీపంలో ఆదివారం సాయంత్రం కల్వకుర్తి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎంవీఎస్ గార్డెన్ ఎదుట నిలుపగా.. బోయిన్‌పల్లికి చెందిన యువకుడు మోక్షిత్ బైక్‌పై వెళ్తూ.. ముందున్న బస్సు వెనుకవైపున ఢీకొట్టాడు. దీంతో మోక్షిత్‌కు బలమైన గాయాలు కావడంతో 108లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

భూత్పూర్: మున్సిపాలిటీలోని మునిరంగస్వామి ఆలయం సమీపంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన కావలి రవిని అర్ధరాత్రి ఢీకొనడంతో వాహనదారులు గుర్తించి108లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ. చంద్రశేఖర్ తెలిపారు.

కుక్కను ఢీకొన్న బైకు..

మహమ్మదాబాద్: రోడ్డుపై వెళ్తున్న బైకు కుక్కను ఢీకొనడంతో బైకు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన అంజిత్‌కుమార్ ఆదివారం ఉదయం 9:30 గంటల సమయంలో గుల్బర్గా నుంచి మహమ్మదాబాద్ మండలం మీదుగా బైకుపై శ్రీశైలం వెళ్తున్నాడు. గంగర్లపహాడు హనుమాన్ ఆలయం సమీపంలో వెళ్తున్న బైకుకు కుక్క అడ్డురావడంతో ప్రమాదవశాత్తు కుక్కను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి

రాజాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్టబద్ధతతో కూడిన 42శాతం రిజర్వేషన్ సాధనకు ఈనెల 25న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం రాజాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చట్టబద్ధతతో రిజర్వేషన్‌లు అమలయ్యేవరకు ఆందోళన కార్యక్రమాలు చేసేందుకు ప్రతి బీసీ బిడ్డ కంకనబద్ధులైన ఉండాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, విజయ్‌కుమార్, రాజేశ్, శేఖర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి రోడ్డు.. సమస్య చిత్తగించండి

భూత్పూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాలకు వెళ్లే రోడ్లులు చిత్తచిత్తడి మారాయి. భూత్పూర్ నుంచి కర్వెన వెళ్లే రహదారిపై ప్రతి నిత్యం ఈ రహదారి గుండా కొత్తూర్, తండాలతో పాటు కర్వెన, లంబడికుంట, ముస్లాయిపల్లికి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రతిరోజూ ఈ గ్రా మాలకు చెందిన ప్రజలు భూత్పూర్ మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు గుంత లు ఏర్పడడంతో రాత్రివేళల్లో ద్విచక్రవాహనదారు లు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



భయం భయంగా!



నవాబుపేట ప్రాథమిక ఆస్పత్రి భవనం శిథిలమై కూలుతున్నా పట్టించుకోని అధికారులు

- మండలానికి పాత భవనాల ముప్పు
- కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకోని వైనం
- భయం గుప్పిట్లో బడులు, కార్యాలయాల నిర్వహణ
- శిథిలావస్థకు చేరినా.. కూల్చకుండా అధికారుల నిర్లక్ష్యం

నవాబుపేట: పాత భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.. పైగా వర్షకాలంలో పాత ఇండ్లను కూలగొట్టాలంటూ చెబుతున్న అధికారులు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరినా.. వాటిని కూల్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనికితోడు పాత పాఠశాల భవనాల్లో చదువులు సైతం భయంగా సాగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ సందర్భంగా తాజాగా వరుస వానలతో మండలంలోని కేశవరావుపల్లి పాఠశాల పాతభవనం కూలింది. అదృష్టవశాత్తు అక్కడ ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపరిపీల్చుకున్నారు. దీంతో అందోళన చెందిన గ్రామస్తులు స్వచ్ఛందంగా పాత భవనాన్ని కూల్చేసుకున్నారు. ఇలా శిథిలమైన భవనాలను ప్రమాదాలు జరగకముందే కూల్చేయాలంటూ ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పైగా కొత్త భవనాలు నిర్మించి పాత భవనాలను వదిలేసి ఏండ్లు గడుస్తున్నా.. వాటిని సైతం కూల్చకుండా అధికారులు నాన్చుడు దోరణి అవలంభిస్తుండడంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని ఆయా శాఖల అధికారులు నిత్యం ఆందోళన చెందుతున్నారు.

■ మండల కేంద్రంలోని పాత పంచాయతీ భవనం కూల్చి వేయాలంటూ రెండేళ్ల క్రితమే అధికారులు అనుమతులిచ్చారు. అయినా పాత భవనం ఇంకా కూల్చలేదు. మండల కేంద్రం నడిబొడ్డున ఉన్న భవనం జనసంచారం ఉన్నప్పుడు కూలితే బాధ్యులు ఎవరంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

■ మండల కేంద్రంలోని పాత ఆస్పత్రి భవనం కూలేందుకు సిద్ధంగా ఉండగా.. ఏండ్లు గడిచినా దాన్ని పట్టించుకోవడంలేదు. కొత్త భవనం నిర్మించి దాన్ని ఉపయోగిస్తూ రావడం దాదాపుగా 5ఏళ్లు గడిచినా కూడ పాత భవనం కూల్చేందుకు ముహూర్తం కుదరలేదు. పైగా పాత భవనం ఆస్పత్రికి వచ్చేవారి దారిలో ఉండడంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందోనని ఆస్పత్రి వర్గాలు నిత్యం ఆందోళనలోనే ఉంటాయి.

■ బడులు సైతం ఎప్పుడు కూలుతాయోనని భయంతో సాగుతున్నాయి. మండలంలోని రంగంపల్లి పాఠశాల భవనం శిలపై పగుల్లు వచ్చి నేర్రలేవారింది. ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలోనే బడి సాగుతుండడంతో ఆ గ్రామప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు మండలంలోని దయాపంతులపల్లి, సిద్దోటం, కారూర్, పోమాల్ పాఠవాల భవనాలు పాతబడి శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే యన్మన్‌గండ్ల బాలుర వసతి గృహం సైతం ఊచలు తేలి కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనంతో విద్యార్థులు భయంతోనే కాలం గుడుపుతున్నారు.



ఊచలు తేలిన యన్మన్‌గండ్ల బాలుల వసతి గృహం

పట్టా భూమి ఆన్‌లైన్‌లో మాయం

నవాబుపేట: తమ పేరుపై పట్టా ఉన్న భూమి ఆకస్మాత్తుగా ఆన్‌లైన్‌లో మాయమైందని.. దీన్ని ఆసరాగా చేసుకుని గ్రామానికి చెందిన కొందరు లాక్కునేందుకు వచ్చి దౌర్జన్యం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితుడు ఫకీరయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని కొల్లూర్‌కు చెందిన ఫకీరయ్యకు గ్రామశివారులో సర్వే నంబర్ 218లో 39గుంటలు, 200 సర్వేనంబర్లో 3గుంటల భూమి పట్టా ఉంది. అలాగే ఇదే గ్రామానికి చెందిన శోభ పేరున 229 సర్వే నంబర్‌లో 13గుంటల భూమి ఉంది. కాగా ఇటీవల భూమి ఆన్‌లైన్‌లో మిస్సింగ్ చూపించింది. అంతలోనే ఆదివారం ఇదే గ్రామానికి చెందిన మల్లయ్య, నర్సింహులు తదితరులు అక్రమంగా భూమిలోకి ప్రవేశించి దున్నడం మొదలు పెట్టారని వారిని అడ్డుకుంటే దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ పేరుపై ఉన్న భూమి ఎలా మాయమైందని తమకు అన్యాయం జరిగిందని న్యాయం చేయాలంటూ వారు పోలీసులను ఆశ్రయించారు. కాగా ఈ విషయంలో తమకు ప్రాణహాని ఉందని కాపాడాలని పోలీసులను ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మైనార్టీల సంక్షేమమే తమ ధ్యేయమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణంలో నిర్మించిన మీర్ మహబూబ్ అలీఖాన్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ కుల మతాలకతీతంగా పరిపాలన అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మీర్ మహబూబ్ అలీఖాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.ఎ.రహీం, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, ముస్లిం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుమ్మరులకు సముచిత స్థానం కల్పించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమ్మరులకు అన్ని పార్టీలు అత్యధిక సీట్లు కేటాయించి సముచిత స్థానం కల్పించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో ఆ సంఘం కార్యవర్గ సమావేశం ని ర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న తమ బతుకుల్లో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానా ల్లో అత్యధికంగా పోటీ చేస్తామని. ఆ దిశగా కుమ్మరులను చైతన్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రామ చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, కోశా.దికారి రవిశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్‌కు చెందిన వడ్డే ఆంజనేయులుకు మంజూరైన రూ.1.75లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశం మేరకు కాంగ్రెస్ నాయకుడు రవీందర్ ఆదివారం అందజేశారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



పోలేపల్లిలో శ్రీకృష్ణుడి ఊరేగింపు



దేవరకద్రలో చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఉట్లు కొడుతున్న యువకులు

జడ్చర్ల టౌన్: శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని బాలకృష్ణ భక్తసమాజం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి శ్రీకృష్ణ భగవానుడి జననం, డోలారోహనం చేశారు. ఆదివారం ఉదయం నిజాభిషేకం, సామూహికంగా కృష్ణ సహస్రనామార్చన, పూజలు చేశారు. రాత్రి నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో బాలకృష్ణ భక్తసమాజం, ఆర్యవైశ్య నాయకులు ఆనంద్‌రాజ్, గణేశ్, లవకుమార్, రామ్మోహన్‌తోపాటు భక్తులు పాల్గొన్నారు.

పోలేపల్లిలో..

త్రైత సిద్ధాంత ప్రబోద సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పోలేపల్లిలో కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు భక్తుల కృష్ణనామస్మరణ మధ్య వైభవంగా చేశారు. ర్యాలీలో భగవద్గీత శ్లోక ఉచ్చారణలతో నినాదాలు మిన్నంటాయి. కార్యక్రమంలో నా గ్యానాయక్, బాలయ్య, మల్లేశ్‌యాదవ్, చెన్నయ్య, జడ్చర్ల వెంకటేశ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

❖ దేవరకద్ర మున్సిపాలిటీలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఉట్ల వేడుకలు నిర్వహించారు. తెల్లవారు జామున శ్రీకృష్ణుడి డోలారోహణం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్ల వేడుకలు నిర్వహించారు. ఉట్లను కొట్టడానికి వచ్చిన చిన్నారులు కేరింతలు కొట్టారు.

❖ చిన్నదర్‌పల్లిలో ఆదివారం రాత్రి ఉట్ల ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విజేతలకు శ్రీకృష్ణుడి చిత్రపటాలను మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అందజేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ

దేవరకద్ర: రోడ్డు భద్రతా నియమాలు డ్రైవర్లు పాటించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ కోరారు. ఆదివారం దేవరకద్ర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో జీపు, ఆటో డ్రైవర్లతో రోడ్డు భద్రతపై జరిగిన అవగాహన కల్పించారు. అతి వేగంగా వాహనాలు నడపరాదని, కెపాసిటీని మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. రోడ్డు నియమాలు పాటించి వేగం తగ్గించుకుంటే ప్రమాదాలు జరగవని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు ఉండాలని, వాహనాల ఆర్‌సీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన ఉడిత్యాల



చౌడమ్మ బోనాల ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

- అమ్మవారి పలారంబండి ఊరేగింపు
- అలరించిన పోతురాజుల విన్యాసాలు

రాజాపూర్(బాలానగర్): అమ్మాబైలెల్లినాదో.. తల్లి బైలెల్లినాదో అంటూ ఆదివారం బాలానగర్ మండలం ఉడిత్యాలలో కోటమైసమ్మ బోనాలు కనుపపండువగా నిర్వహించారు. మహిళలు సుందరంగా అలంకరించిన బోనాలతో గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన బుల్‌జీన్స్ ఎండీ సక్కెరశ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పలారంబండిపై అమ్మవారిని గొర్రెపొట్టేలు లాగుతూ వీధుల్లో పోతురాజుల విన్యాసాల మధ్య ఊరేగింపు నిర్వహిస్తుండగా సివసత్తులు పునకాలు ఊగారు. యువకులు డీజే చప్పుళ్లమధ్య డాన్స్‌లు చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, నాయకులు బచ్చిరెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, వెంకట్‌చారి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడమ్మ బోనాలు

జడ్చర్ల టౌన్: కావేరమ్మపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చౌడమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో పూజలు చేసి కొత్తగంపలు తలపై పెట్టుకుని చౌడమ్మగుట్ట వద్ద ఉన్న ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. బోనాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, చైర్‌పర్సన్ పుష్పలత హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పాతబజార్ కోటమైసమ్మ బోనాలలో వారు పాల్గొన్నారు.



పలారంబండితో ఊరేగింపు నిర్వహిస్తున్న శ్రీధర్‌గౌడ్

అటెన్షన్ ప్లీజ్

మరమ్మతు మరిచారు



అడ్డాకుల: మండలంలోని రాచాల బీటీరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. పొన్నకల్ చెరువు కట్ట నుంచి రాచాల వరకు చాలాచోట్ల బీటీరోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. 2023 జూన్ చివరి వారంలో రూ.2.40కోట్ల పంచాయతీరాజ్ ఎంఆర్ఆర్ నిధులతో బీటీరోడ్డును వేశారు. తర్వాత కొన్ని రోజులకే చాలాచోట్ల బీటీరోడ్డు పాడవడంతో వాటికి మరమ్మతులు చేశారు. అప్పుడు మరమ్మతులు చేసినచోట ఇప్పుడు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో వర్షం నీళ్ల నిలవడంతో పెద్దగా మారుతున్నాయి. ఈ రోడ్డుపై ఆర్టీసీ బస్సుతోపాటు ఆటోలు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తాయి. గుంతలమూలంగా రాత్రివేళ వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



ఆర్‌ఐకి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి

రాజాపూర్: కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాజాపూర్ మండల శివారులో ప్రవహిస్తున్న దుందుభీ వాగును ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామంలోనైనా ఇబ్బందులు తలెత్తితే మండల అధికారులకు సమాచారం ఇవ్వాలని మండల ప్రజలకు సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వాటిలో ఎవరూ నివాసం ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐ యాదయ్యకు సూచించారు. అంతేకాకుండా ముదిరెడ్డిపల్లి నుంచి నందిగామకు వెళ్లేదారిలోని రైల్వే అండర్‌పాస్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

'స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర శూన్యం'



మాట్లాడుతున్న మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్దన్

మహబూబ్‌నగర్ రూరల్: ఢిల్లీలో ఎర్రకోటపై ప్రధాని నరేంద్రమోదీ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లు పాల్గొనట్లు మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందని మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్దన్ పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాల్ అనే అంశంపై క్రిష్టియన్‌పల్లిలో కేవీపీఎస్, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తూ, కేంద్రం రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగంలో అనేక సవరణలు చేస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ఓబీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని సవరణ చేసిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ముస్లింల బూచి చూపి బీసీల రిజర్వేషన్లు అమలు చేయడం లేదన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి భరత్ మాట్లాడుతూ.. దేశంలో రాజ్యాంగాన్ని తొలగించి మనస్మృతి అమలు చేయాలని కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు, వార్డెన్ కృష్ణమోహన్, అంజి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన విస్తరించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వీహెచ్‌పీ క్షేత్ర ఘటన సంఘాన్ని అన్ని గ్రామాలకు విస్తరింపజేయాలని క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యంజీ సూచించారు. ఆదివారం స్థానిక గణేశ్ భవన్‌లో వీహెచ్‌పీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులు జరుపుకొనే ప్రతి పండగకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. గోవు ఆధారిత వ్యవసాయం చేయడంతో భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఆవు పాలు శ్రేష్ఠమైనవని, ఫ్యాట్ తక్కువగా ఉండడంతో తక్కువ ధర పలికి పాడి రైతుకు గిట్టుబాటు కావడం లేదన్నారు. దీని నివారణకు అందరూ ఆవు పాలను కొనాలని కోరారు. అనంతరం వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శిగా గోవిందరెడ్డి, నవాబ్‌పేట ప్రఖండ సహ ప్రభారిగా బాలశివుడు, జిల్లా సంపర్క విమర్శ ప్రముఖ్‌గా ప్రాణేశ్‌చారిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, ప్రాంత సహ కార్యదర్శి వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగరాజ్, విభాగ సహ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పద్మచక్ర అవార్డు ప్రదానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని సుభాశ్‌నగర్‌కు చెందిన శ్రీలక్ష్మీ నారా యణ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు మణి ఆనంద్‌కు పద్మచక్ర అవార్డులు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సినీనటుడు బాబుమోహన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. రక్తదానం, అన్నదానం, సామాజిక సే వా కార్యక్రమాలు చేసినందుకు అవార్డు లభించిందని, దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.



'ఉపవాసంతో ప్రార్థించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉపవాసంతో దేవుడిని ప్రార్థిస్తే సమస్యలను అధిగమించవచ్చని రెవ.పాస్టర్ బి.ఎస్.పరంజ్యోతి అన్నారు. వచ్చే నెల 3, 4, 5వ తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉపవాస ప్రార్థన పండగల వాల్‌పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దేవయ్య, లక్ష్మన్న, అబ్రహం, శ్యాం సుందర్‌రాజు, రంగస్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీయూలో ఈనెల 30, 31న జరిగే రాజేంద్రప్రసాద్ స్మారక రాష్ట్రస్థాయి (14, 16, 18, 20 ఏళ్లలోపు) అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను ఆదివారం జిల్లా ప్రధాన స్టేడియంలో నిర్వహించారు. ఈ ఎంపికలను మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి శరత్‌చంద్ర, పీఈటీలు రమేశ్‌బాబు, శ్రీనివాసులు, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా అండర్-17 క్రికెట్ టోర్నీ

జడ్చర్ల టౌన్: జడ్చర్ల క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో మినీ స్టేడియం మైదానంలో జరుగుతున్న 18వ ఇంటర్ స్కూల్ ఛాంపియన్‌షిప్ అండర్-17 క్రికెట్ టోర్నీలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. మొత్తం మూడు మ్యాచ్‌లు నిర్వహించగా మొదటి మ్యాచ్‌లో శ్లోక వర్సెస్ సెయింట్‌పాల్స్ జట్లు పోటీపడగా శ్లోక జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్ అక్షర వర్సెస్ ఉదయ మెమోరియల్ జట్ల మధ్య జరుగగా ఉదయ జట్టు విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో శ్లోక-మౌంట్‌బాసిల్ జట్లు తలపడగా శ్లోక జట్టు విజయం సాధించింది.

తొలిసారిగా యూట్యూబ్‌లో లైవ్

జిల్లాలో తొలిసారిగా క్రికెట్ మ్యాచ్‌లను యూట్యూబ్‌లో లైవ్ వీక్షణకు ఏర్పాట్లు చేశారు. దీంతో క్రికెట్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య పరికరాల పంపిణీ

దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్‌లో ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండేందుకు కావాల్సిన పరికరాలను జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ ఆదివారం వైద్యసిబ్బందికి అందజేశారు. చిన్నారుల జలుబు, శ్వాసకోశ సమస్యలకు ఉపయోగపడే నెబ్యులైజర్, వృద్ధులు, ఇతర వ్యాధిగ్రస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసే టెస్టుకిట్‌లను అందజేశారు.